పథకాల అమలులో అశ్రద్ధ వద్దు : మంత్రి ఉషశ్రీచరణ్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో అశ్రద్ధ వద్దని మంత్రి ఉషశ్రీచరణ్ సూచించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో వివిధ మండలాల సర్పంచులు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, గ్రామస్థాయి నాయకులతో సమీక్ష సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న నాయకులు అర్హులైన వారి ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలు అందుతున్నాయా.. లేదా.. అని తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా రాకుంటే అందజేసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను అందించాలన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న నాయకులు

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

సిపిఎం ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భారతదేశ చరిత్రలో ఎప్పుడు కనివిని ఎరుగని దుర్మార్గాలు బిజెపి ప్రభుత్వం హయాంలో మణిపూర్‌లో జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని కోరుతూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లలితకళాపరిత్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే రోడ్డుపై బైటాయించి సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రం మంటల్లో కాలిపోతున్నప్పటికీ నరేంద్ర మోడీ ఇప్పటి దాకా మాట్లాడకపోవడం చూస్తుంటే ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ఈ దారుణాలు జరుగుతున్నట్లు ఉందని విమర్శించారు. 35 లక్షల జనాభా కలిగిన రాష్ట్రంలో ఇంత పెద్ద సైన్యం, పోలీసులు ఉన్నా భారతదేశం ఏమి చేయలేక చేతులు కట్టుకొని ఉందంటే కచ్చితంగా ఇది రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న బిజెపి, కేంద్రంలో ఉన్న పెద్దల సహకారంతోనే కొందరు ఈ దుర్మార్గమైన చర్యలకు పాల్పడు తున్నారని విమర్శించారు. మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసినా ఎటువంటి స్పందన లేదంటే ఇంతకంటే దుర్మార్గమైన చర్య ఇంకా ఏమి ఉంటుందని ప్రశ్నించారు.గతంలో ముస్లింలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించిన ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ ఇప్పుడు గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న కుకీ తెగల మీద ఈ విధమైన దాడులు చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న వారి మీద దాడి చేసి అక్కడ ఉన్న భూమిని మైనింగ్‌కు ఆదాని, అంబానీకి కట్టబెట్టడం కోసమే ఈ చర్యలకు పాల్పడుతున్నారని పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడు కుందామని, భారత దేశ రాజ్యాంగాన్ని పటిష్ట పరుచు కుందామని మత సామరస్యాన్ని కాపాడుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, వలీ, ముత్తుజ, ప్రకాష్, మసూద్, బాబు, మనోహర్, సురేంద్ర, ఆది, నాగభూషణం, రాజు, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, వరలక్ష్మి, మరియమ్మ, ఇస్మాయిల్, మోహన్, శివ రుద్ర తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - బొమ్మనహాళ్

తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. దీంతో మండలంలోని తుంగభద్ర జలాశయం కింద పంట సాగు చేసే ఆయకట్టు రైతుల ఆశలు చిగురిస్తూ ఉన్నాయి. జులై 15 వరకు జలాశయంలో కేవలం మూడు టీఎంసీల నీటిమట్టం ఉండేది. ఇన్‌ఫ్లో ఏమాత్రం లేకపోయి ఉండేది. జూలై 20 నుండి నీటిమట్టం 9536 క్యూసెక్యూలతో ప్రారంభమై 23 నాటికి 54,657 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతోందనిజలాశయం అధికారులు తెలిపారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం నాటికి 21 టీఎంసీల నీటిమట్టం జలాశయంలో ఉందని ఇన్‌ఫ్లో భారీగా వస్తున్నందున ఆగస్టు మొదటి వారానికి 40 టీఎంసీలు చేరవచ్చునని తెలుస్తోంది. కర్నాటకలోని జలాశయం పరివాహక ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి కురుస్తున్న మోస్తారు వర్షాలకు జలాశయంలో నీటిమట్టం పెరుగుతోందని అధికారులు అన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు జీవనది అయిన తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం పెరుగుతున్నందున రైతులు ఆశలు చిగురిస్తున్నాయని మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అసలే ఆంధ్రాలో అరకొర వర్షాలతో నేటికీ ఎలాంటి పంటసాగు చేయలేని దుస్థితి నెలకొంది. తుంగభద్ర జలాశయం సాగునీరు వస్తే తప్ప కనేకల్, బొమ్మనహల్, విడపనకల్లు మండలాల్లో పంట సాగు చేయడం సాధ్యం కాదు. గత సంవత్సరం ఈ సమయానికి తుంగభద్ర జలాశయంలో 48,412 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండి జలాశయంలో 104 టీఎంసీల నీరు నిలువ ఉండేది. ప్రస్తుతం జలాశయానికి పూర్తిస్థాయి నీటిమట్టం వస్తే తప్ప ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు సాగు. తాగునీరు అందించే అవకాశాలుంటాయని అధికారులు అంటున్నారు హెచ్ ఎల్ సి కి నీటిని విడుదల చేయాలంటే 60 టీఎంసీలు నీటిమట్టం ఉండాలి. ఈ మేరకు ఇంకా 40 టీఎంసీలు నీరు చేరాల్సుంది.

తుంగభద్ర జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం

పల్లె X దుద్దుకుంట

వేడెక్కుతున్న పుట్టపర్తి రాజకీయం

వైసిపి, టిడిపిల మధ్య పెరుగుతున్న నిరసనలు, మాటల యుద్ధం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతుంది. సాధారణ ఎన్నికలకు ఇంకా 9 నెలలు ఉన్నప్పటికీ అధికార పార్టీ అయిన వైసీపీ, ప్రతిపక్షమైన టిడిపిల మధ్య పరస్పర మాటలు యుద్ధం కొనసాగుతోంది. నిరసనలు రూపంలో రాజకీయ వేడి మొదలైంది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కెనరా బ్యాంకులో అప్పు చేసిన రూ. 908 కోట్లు చెల్లించకపోవడంతో ఆ బ్యాంకు ఆగస్టు 18న ఎమ్మెల్యే ఆస్తులను వేలం వేస్తామని ప్రకటించడంతో ప్రతిపక్ష పార్టీకి ఒక అస్త్రం దొరికినట్లు అయింది. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అఫిడవిట్లో తన ఆస్తులు చూపించలేదని బ్యాంకు ప్రకటించిన అప్పులతో పాటు బయట ఇంకా ఎన్ని అప్పులు ఉన్నాయో అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జగన్ కు బినామీ అని చెప్పుకుంటూ తన సిరాస్తులు కన్నా ఎక్కువ అప్పులు చేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తూ తక్షణం ఆయన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఓడిసి మండల కేంద్రంలో పల్లెతో పాటు ఆ పార్టీ నాయకులు ధర్నా చేసి నిరసన తెలిపారు. మరొకవైపు వ్యాపారాలు అన్నాక అప్పులు చేసిన మాట వాస్తవమేనని, అప్పు చేస్తే ఎగర కొట్టినట్లు ప్రచారం చేయడం పట్ల ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే రుణ వాయిదాలు చెల్లిస్తామన్నారు. తమ పార్టీలోనే ఉన్న ఒక కురువృద్ధుడు 'పల్లె'తో చేతులు కలిపి కుట్ర చేస్తున్నారని పరోక్షంగా కొత్తకోట సోమశేఖర్ రెడ్డిని ఉద్దేశించి మీడియా ముందు ఆరోపించారు. వైసిపి నాయకులు ఓడిసి, నల్లమాడ, పుట్టపర్తి మండల కేంద్రాలలో 'పల్లె'కు వ్యతిరేకంగా నిరసనలు చేశారు. కొత్తకోట సోమశేఖర్ రెడ్డి వెన్నుపోటు రాజకీయాలు చేయవద్దని హెచ్చరించారు. గత రెండు నెలల క్రితం టిడిపి వర్గీయులు, వైసీపీ శ్రేణులు పట్టణం నడిబొడ్డున హనుమాన్ కూడలిలో బాహబాహికి దిగి రాళ్లతో,చెప్పులతో దాడికి దిగారు. ఈ సంఘటన మరవక ముందే తిరిగి ఒకరిపై ఒకరు ఆరోపణలు నిరసనలకు దిగి నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయం రాజేశారు. అయితే ఈ సంఘటనలు ఎక్కడికి దారితీస్తాయోనని ఇరు పార్టీల కార్యకర్తలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలుష్యాన్ని నిర్మూలిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

మొక్క నాటి నీరు పోస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-ఉరవకొండ

మొక్కలను పెంచి కాలుష్యాన్ని నిర్మూలిద్దామని జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని నింబగల్లు గ్రామంలో అనంత ప్రకృతి ఫౌండేషన్, యోగివేమన పిరమిడ్ ధ్యాన కేంద్రం నింబగల్లు సంయుక్తంగా నిర్వహించిన పత్రీజీ ధ్యానవనం కార్యక్రమంలో భాగంగా నాలుగెకరాల పొలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల మానసిక రుగ్మతలు దూరమవుడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అలాగే మొక్కలు నాటి పెంచడం వల్ల పచ్చదనం పెరగడంతోపాటు వాతావరణంలో సమతుల్యం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకుని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రకృతి ఫౌండేషన్, యోగివేమన పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గూగూడుకు భక్తుల తాకిడి

కిక్కిరిసిన కుళ్లాయిస్వామి ఆలయం

గూగూడు కుళ్లాయి స్వామి ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు, ఇన్‌సెట్‌లో స్వామివారిని దర్శించుకున్న ఆర్‌డిఒ మధుసూదన్

ప్రజాశక్తి-నార్పల

భక్తుల తాకిడితో మండల పరిధిలోని గూగూడు కిక్కిరిసిపోయింది. కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి స్వామివారికి నిత్య నివేదన పూజలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలో ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల మధ్య తోపులాట జరగకుండా పోలీసులు ఆలయ ఆవరణలో భారికేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వికలాంగులు, మహిళలకు ప్రత్యేక బారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు రోజుల్లో వచ్చే జనం తాకిడికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయాధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఆర్‌డిఒ

గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వాములను ఆర్‌డిఒ మధుసూదన్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, హుసేనప్ప కార్యనిర్వాణాధికారిణి శోభ, ఆలయ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆర్‌డిఒకు శాలువా కప్పి ప్రసాదాలు అందజేశారు. ఆయనతోపాటు ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

నార్పలలో స్తంభించిన ట్రాఫిక్

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ ట్రాఫిక్‌తో స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కూతలేరు వంతెన వద్ద ఉన్న మలుపు వద్ద సుదూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు చాలా ఇబ్బంది పడ్డారు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ప్రధాన ఘట్టాలైన చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్త, అగ్నిగుండ ప్రవేశం రోజు ఎలా ఉంటుందో అని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బటర్ ఫ్లై లైట్ల మరమ్మతులు

కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నార్పలలోని గూగూడు రోడ్డులో ఉన్న బటర్ ఫ్లై లైట్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురం నుంచి ప్రత్యేకంగా క్రేన్‌ను తెప్పించి రిపేరి చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు మాట్లాడుతూ గూగూడు కుల్లాయి స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నార్పల మెయిన్ రోడ్డులో బటర్‌ఫ్లై లైట్లకు మరమ్మతులు చేస్తున్న అధికారులు

మాజీ సైనికుల సంక్షేమమే లక్ష్యం

జిల్లా సైనిక సంక్షేమ అధికారి జె.శ్రీనివాసులు

జిల్లా సైనిక సంక్షేమ అధికారి జె.శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మాజీ సైనికులు, కుటుంబ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి జె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో పంచుకున్నారు. దేశానికి సేవ చేసిన మాజీ సైనికులకు తన వంతు సేవ అందించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. తమ శాఖ ద్వారా మాజీ సైనికులకు అమలయ్యే కార్యక్రమాలన్నింటిని వారికి చేరువ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్న : సైనిక సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలు ?

జవాబు : మాజీ సైనికులకు 20 అంశాల పైబడి సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నాం. మాజీ సైనికుల పిల్లలకు వివాహ ప్రోత్సాహకాలు అందజేస్తున్నాం. ఇద్దరు ఆడపిల్లలైతే ఇద్దరికి వివాహ ప్రోత్సాహకం కింద రూ.50 వేలు అందిస్తాం. అయితే వివాహం చేసుకున్న 180 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కులాంత వివాహం చేసుకుంటే రూ.10 వేలు, వితంతవుల పునర్ వివాహం కోసం రూ.20 వేలు చొప్పున ఇస్తారు. మాజీ సైనికుల భార్య పేరు, పుట్టిన తేదీ వంటి వాటిని సరి చేయించి ఇస్తాం. వారి పిల్లల పేర్లు నమోదు వంటివి పక్కాగా ధ్రువపత్రాలు అందేలా చూస్తాం. మాజీ సైనికుల పిల్లలకు 100 శాతం వికలాంగత్వం ఉంటే వారికి నెలకు రూ. 4 వేలు చొప్పున పెన్షన్ అందిస్తున్నాం. దివ్యాంగులైన పిల్లలకు నెలకు రూ.1000 ఇస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన రెండు పెన్షన్‌లు మాజీ సైనికుల వితంతవులకు రెండు పెన్షన్‌లు ఇవ్వడం జరుగుతుంది. మాజీ సైనికులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేసి ఎలాంటి పెన్షన్లు లేని వారు 65 సంవత్సరాలు నిండిన వారందరికి పెన్యూరీ గ్రాంట్ కింది నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ మంజూరు చేస్తాం. మాజీ సైనికులు, వితంతువులు మృతిచెందితే దహన సంస్కారాలకు రూ.5 వేలు చెల్లిస్తాం. మాజీ సైనికుల అనాథ పిల్లలకు నెలకు రూ.1000 అందజేస్తాం. న్యాయపరమైన కేసులకు రూ.5 వేలు సహాయం ఇస్తారు. వృత్తి విద్యా శిక్షణ కోసం మాజీ సైనికులు, వారి వితంతువులకు నెలకు రూ. 20 వేలు ప్రభుత్వం ఇస్తుంది. వైద్య ఖర్చులు రూ.30 వేలు వరకు వస్తుంది. 1996కు మునుపు పని చేసిన మాజీ సైనికులు ఇసిహెచ్‌ఎస్ మెంబర్‌షిప్ ఉంటే చాలు కార్డు కోసం మాత్రమే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత నుంచి పని చేసిన వారందరూ ఇసిహెచ్‌ఎస్ ప్రీమియం ఒక సారి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

ప్ర : విద్యా వైద్య రాయితీలు కల్పిస్తున్నారా ?

జ: మాజీ సైనికుల పిల్లలకు 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే వారికి నెలకు రూ. 1000 చొప్పున ఇస్తారు. వితంతువుల పిల్లలకు పీజీ వరకు చదివే వారికి ఇస్తారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున అందుతుంది. మాజీ సైనికులకు గ్రాజుయేషన్ సర్టిఫికేట్‌లు ఇప్పించడం జరుగుతుంది. మాజీ సైనికులు, సైన్యంలో పని చేస్తున్న వారు, వారి పిల్లలకు ఇంజనీరింగ్, ఐసెట్, బిఫార్మసీ, అగ్రికల్చర్ వంటి కోర్సులకు 2 శాతం రిజర్వేషన్, మెడికల్ కోర్సులు ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్ 1 శాతం రిజర్వేషన్, టీచర్ ట్రైనింగ్ కోర్సులకు 4 శాతం, పాలిటెక్నిక్, ఐటిఐ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సులు 2 శాతం రిజర్వేషన్ చొప్పున విద్యాభివృద్ధికి సహకారం అందుతోంది. ఈ సౌకర్యాలకు క్యాప్ సర్టిఫికేట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉన్నత విద్య కోసం పిఎంఎస్ఎస్ పథకం కింద మగపిల్లలకు రూ.2 వేలు, ఆడపిల్లలకు రూ.2,250 ఇస్తారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేల వరకు మంజూరు చేస్తారు. వైద్య సేవలు పొందిన 180 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్ర : గృహ నిర్మాణాలకు ఎలాంటి సహకారం అందుతుంది. సాగు భూమి ఇస్తున్నారా ?

జ : మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులు కలిసి హౌసింగ్ సొసైటీగా ఏర్పడితే వారికి 175 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వ ధరకే కేటాయించబడుతుంది. మాజీ సైనికులు నిర్మించుకున్న ఇళ్లకు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో ఉన్న వారికి ఇంటి పన్ను మినహాయింపు ఉంటుంది. వారు హౌసింగ్ ప్రొసిడింగ్స్ పొంది వారి వద్దనే ఉంచుకుంటే చాలు. విపత్తులో ఇళ్ల డ్యామేజ్ అయితే మరమ్మతుల కోసం రూ.20 వేలు ఇస్తారు. మాజీ సైనికులకు 5 ఎకరాల సాగు భూమి ఇస్తారు. మాగాణి భూమి అయితే 2.50 ఎకరాలు ఇస్తారు. అయితే వారు రిటైర్ అయిన 3 సంవత్సరాల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్ర : జిల్లాలో ఎంత మంది మాజీ సైనికులు ఉన్నారు ? వారిలో ఎంతమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా ?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 6 వేల మంది మాజీ సైనికులు, వారి ఆధారిత కుటుంబికులు ఉన్నారు. వారందరికి ప్రభుత్వం అందించే ప్రతిది అర్హత ఆధారంగా అందుతోంది. పదవి విరమణ పొందిన మాజీ సైనికులు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వాలు అవకాశాలు కల్పిస్తున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నాం. పిఎంఇజిపి పథకం ద్వారా ఉత్పత్తి పరిశ్రమ ప్రాజెక్టులకు రూ.25 లక్షలు, ఉత్పత్తేర సర్వీసు పరిశ్రమలకు రూ.10 లక్షలు చొప్పున రుణాలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీ, పట్టణాల్లో 25 శాతం రాయితీలు కల్పిస్తున్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాటు, గ్యాస్ ఏజెన్సీలు నిర్వహణకు ప్రభుత్వం ప్రోత్సాహక రాయితీలు కల్పిస్తోంది. మాజీ సైనికులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి స్వగ్రామంలోని ప్రజలకు పది మందికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయి. దేశాన్ని రక్షించి తమ వంతు సేవ చేసిన మాజీ సైనికులను మనమందరం గౌరవించాలి. దేశం రక్షణకు యువత ముందుకు సాగాలి.

కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ నాయకత్వంలో కలిసికట్టుగా పని చేసి అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఎపి ఎన్‌జిఒ నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించడంతోపాటు ఎన్జీఓ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ఎనలేనిదని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకెళ్తున్నామన్నారు. ఇందులో భాగంగానే అనంతపురంలో రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. టవర్‌క్లాక్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం సమయంలో కొన్ని భవనాలు తొలగించాల్సి వచ్చిందని, ఈ సమయంలో ఎన్జీఓ సంఘం నేతలు, ఉద్యోగులు సహకారం అందించారని గుర్తుచేశారు. తన తండ్రి, తాను ఎంపీగా ఉన్న సమయంలో ఎన్జీఓలకు అండగా నిలిచామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించే విషయంలో మీ తోడ్పాటు మరింత అవసరమన్నారు. సీఎం జగన్ నాలుగేళ్లుగా ఎంతో సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారంటే అందులో ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో ఉందని కొనియాడారు. కోవిడ్ వంటి పరిస్థితులు ఎదురుకావడంతో ఆర్థిక సమస్యలు వచ్చాయని, అయినా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే అనేక సమస్యలకు పరిష్కారం చూపామని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలకూ త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్సీ విషయంలోనూ మంచి వార్త వింటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖరరెడ్డి, ఎపి ఎన్‌జిఒ జిల్లా సెక్రటరీ చంద్రమోహన్, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా కార్యదర్శి జవహర్, ఎన్జీఓ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనే లక్ష్మీ సెహగల్ ఆశయం

వర్ధంతి సభలో ఐద్వా నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమ సమాజ స్థాపనే లక్ష్యంగా స్వాతంత్ర్య సమరయోధురాలు, మాజీ రాజ్యసభ సభ్యులు లక్ష్మీ సెహగల్ సేవలు అందించారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల కొనియాడారు. లక్ష్మీ సెహగల్ వర్ధంతిని పురస్కరించుకుని గుత్తి, గుంతకల్లు, గార్లదిన్నె, అనంతపురం తదితర మండలాల్లో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా గార్లదిన్నె, మర్తాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళల పక్షపాతిగా లక్ష్మీ సెహగల్ జీవించారని తెలిపారు. గొప్ప సంఘ సేవకురాలిగా, సామాజిక సేవా కార్యకర్తగా సమ సమాజ స్థాపన కోసం ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్యపాన నిషేధం, వంటి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సింగపూర్‌లో డాక్టర్ చదివి స్వదేశంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య సేవలు అందించారని తెలిపారు. సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళాదళాల్లో చేరి క్యాప్టెన్ హోదా పొందారని తెలిపారు. ఆమె ఆశయాలు సాధించడమే లక్ష్యంగా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు లక్ష్మీదేవి, త్రివేణి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీసెహగల్‌కు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

శ్రీచైతన్య అధినేత బిఎస్. రావ్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న బళ్లా కన్వెన్షన్ హాల్లో శ్రీచైతన్య పాఠశాలల అధినేత బి.ఎస్.రావుకు ఎజిఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బంది దాదాపు 4,000 మంది హాజరై బి.ఎస్.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీమంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, కాలవ శ్రీనివాసులు, మాజీ నగర మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, టౌన్ బ్యాంక్ ప్రెసిడెంట్ మురళి, వైసిపి నగర అధ్యక్షులు సోమశేఖర్‌రెడ్డి, సిపిఐ నాయకులు నారాయణస్వామి, సిపిఎం నాయకులు శ్రీరాములు, అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, ఆర్డిటి అధికారులు, ఉన్నారు.

శ్రీచైతన్య అధినేత బిఎస్. రావుకు నివాళులర్పిస్తున్న మాజీమంత్రులు పల్లె రఘునాథ్‌రెడ్డి, పరిటాల సునీత, తదితరులు

బాలగంగాధర్ తిలక్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత జాతీయోద్యమ పితామహుడు బాల గంగాధర్ తిలక్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయోద్యమ పితామహుడుగా పేరొందిన బాలగంగాధర్ తిలక్ దేశవ్యాప్తంగా సామాన్య ప్రజానీకానికన్నీ ఉద్యమంలో పాల్గొనేలా చేయడంలో కీలకపాత్ర పోషించాడన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆశాంతికి వ్యతిరేకంగా పోరాడటంలో మూలకారాకూడని భావిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా, మాజీ అధ్యక్షులు ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, తాడిపత్రి చింతల వెంకట రమణ స్వామి దేవస్థానం ఛైర్మన్ బాన నాగేశ్వరరెడ్డి, ఉప గ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి తదితరులు పాల్గొన్నారు.

బాలగంగాధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి

అనుమతులు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయడంతోపాటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి, ఎన్ఎస్‌యువై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ, ఎపిఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అనేక ప్రయివేట్ పాఠశాలలు అనుమతులు లేకుండా కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని, అలసత్వం వహిస్తున్న విద్యా శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

'భారతి'కి జనసేన నాయకుల సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

కూలిపని చేసుకుంటూ ఇటీవల డాక్టరేట్ అందుకున్న నాగులగుడ్డం గ్రామానికి చెందిన సాకే భారతిని జనసేన నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా గ్రామంలోని భారతి ఇంటికి చేరుకున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ ఆమెకు శాలువా, పట్టుచీర అందజేసి సత్కరించారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న గార్లదిన్నె మండల అధ్యక్షులు గోగుల తాతయ్యను పరామర్శించారు. ఈ కర్యాక్రమంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళీకష్ణ,శింగనమల మండల అధ్యక్షులు తోట ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకే ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు జయమ్మ, కృష్ణమూర్తి, ముప్పూరు కృష్ణ, కిరణ్‌కుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, మండల ఉపాధ్యక్షులు సాయికుమార్, యువ నాయకుడు తోట రామ్మోహన్, ఆది, తాతయ్య, లాల్‌స్వామి, పవనిజం రాజు, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

భారతిని సన్మానిస్తున్న జనసేన పార్టీ నాయకులు

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.269/2021
యం.చంద్రశేఖర్‌రెడ్డి. ...వాది
-వర్సెస్-
జి.లక్ష్మీనారాయణరెడ్డి. ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్లు
జి.లక్ష్మీనారాయణరెడ్డి తండ్రి జి.కేశవరెడ్డి, వ్యాపారం, తిమ్మపల్లె గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తం రూ.1,03,160/-లు ఇందుపైన వడ్డీ,కోర్టు ఖర్చులు రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీకు చేరనందున కోర్టువారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలుపమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 17-08-2023 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 17-08-2023
యం.జయభరత్‌రెడ్డి,
యన్.రాఘవాచార్యులు,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

మణిపూర్ హింస అమానవీయ చర్య

కవి సమ్మేళనంలో కవులు

ప్రజాశక్తి-అనంతపురం

మణిపూర్ రాష్ట్రంలో చెలరేగుతున్న హింసాకాండ అమానవీయ చర్య అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ అధ్యక్షత 'మణిపూర్ హింస.. ప్రతిఘటన కలాలు' పేరుతో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ లైవ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరిగిన దుర్మార్గ ఘటనపై ప్రతి ఒక్కరూ సత్వరమే స్పందించి వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ ఇలాంటి ఘటనలు సంభవించిన వెంటనే యువకులు సత్వరమే స్పందిస్తూ సమాజాన్ని చైతన్య పరిచే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ మహిళల ఓట్ల కోసం నానా పాట్లు పడే ప్రభుత్వాలు వారిమానాన్ని కాపాడలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రక్షణ వ్యవస్థ వైఫల్యానికి మణిపూర్ ఘటన అద్దం పడుతోందన్నారు. తర్వాత కవులు చాలా విలువైన కవితలతో మణిపూర్ మారణకాండని నిరసించారు. ఈ కార్యక్రమంలో మానవతా రక్తదాతల సంస్థ అధినేత తరిమెల అమరనాథరెడ్డి, జిరసం గౌరవ సలహాదారు కంబదూరు షేక్ నబిరసూల్, సీనియర్ కవి జెట్టి జయరాం, గోవిందరాజులు, జిరసం కోశాధికారి కోటిగారి వన్నప్ప, పోతుల రాధాకృష్ణ, డాక్టర్ ఎం.ప్రగతి, దాసన్నగారి కృష్ణమూర్తి, డాక్టర్ బృందా, జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, ఆర్ట్స్ కళాశాల ఫిలాసఫీ లెక్చరర్ రమేష్, అడవాళ శేషగిరి రాయుడు, మధురశ్రీ, దోరణాల విదురారెడ్డి, విశ్వనాథరెడ్డి, రామచంద్రనాయక్, చెట్ల ఈరన్న, ఒంటెద్దు రామలింగారెడ్డి, వలస రమేష్, హర్షిత, గణేష్, వంశీ, ఏసుదాస్, మల్లినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైఎస్ఆర్ లైవ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ

'జనభేరి'కి విశేషస్పందన

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను వివరించేందుకు చేపట్టిన జనభేరి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ తెలిపారు. ఆదివారం నగరంలోని రెండవ డివిజన్ బిందెల కాలనీలో నిర్వహించిన జనభేరి కార్యక్రమంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ జనసేనను విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే మూడేళ్ల చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి తల్లిదండ్రులు వరుణ్‌కు వివరించగా చిన్నారి ఆరోగ్యానికి నాది భరోసా అంటూ హైదరాబాద్ లోని స్పెషలిస్టులతో వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు రొళ్ల భాస్కర్, హుస్సేన్, కార్యదర్శులు వడ్డే వెంకటేష్, నెట్టిగంటి హరీష్, మరియు నాయకులు మేదర్ వెంకటేష్, రహీం డాక్టర్ షోరూం, హిద్దు, నజీమ్, నౌషాద్, సల్మాన్, పిల్లమరి శీన, వీరమహిళలు మంజుల, దోనే సరిత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

మెడికల్ ప్రాక్టీషనర్లను ప్రభుత్వం గుర్తించాలి

ప్రజాశక్తి-గుత్తి

ప్రయివేటు మెడికల్ ప్రాక్టీషనర్లను ప్రభుత్వం గుర్తించాలని ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పట్టణంలోని రవితేజ హోటల్లో గుత్తి తాలూకా శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ గుత్తి తాలూకా కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు బీసీ.మస్తానయ్య, ఉపాధ్యక్షులు వైడి.వర్మ సమక్షంలో తాలూకా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. తాలూకా అధ్యక్షులుగా వి.నాగేంద్ర, కార్యదర్శి నాగమల్లారెడ్డి, కోశాధికారి పివి.రవికుమార్, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, పామిడి రవికుమార్, పెద్దవడుగూరు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు వెంకటరమణ, జేడీ.వలి, రంగ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా అంజినాయక్, కుళ్లాయప్ప, ఓబులప్ప యాదవ్, శ్రీదేవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రయివేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

13 నుంచి బీబీ జైనబ్బీ ఉరుసు

ప్రజాశక్తి-ఉరవకొండ

వచ్చేనెల 13, 14, 15వ తేదీల్లో పట్టణంలోని బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్థానిక దర్గాలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఉరవకొండ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు, దర్గా సందర్శనకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో దర్గా అధ్యక్షుడు హోతూరు బాషా, అనుబంధ అధ్యక్షుడు వడ్ల సలీమ్, ఉపాధ్యక్షుడు బ్యాళ్ల ప్రసాద్, సెక్రటరీ జీఎంఎస్ షాకీర్, ట్రెజరర్ జెండా జీలాన్, టీమ్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరం బాషా, కో అప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, ఎంపిటిసి హొన్నూరుసాబ్, డైరెక్టర్లు ఖాదర్‌బాషా, అయ్యర్ బాబా, అన్వర్, బేల్దారి శర్మస్, కనేకల్ యూసుఫ్, దూదేకుల శంసు, ఆసీఫ్, తేజా, తాజు, ముల్లా జీలాన్, ఆదోని ఖాజా, వైసిపి మైనారిటీ అధ్యక్షుడు పామిడి జాకీర్, అయ్యర్ దాదు, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీబీ జైనబ్బీ అమ్మవారి కమిటీ సభ్యులు

నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మణిపూర్‌లో సామూహిక అత్యాచారానికి గురైన మహిళలకు న్యాయం చేయాలని సిపిఎం, ప్రజా, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో సిపిఎంతోపాటు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, మహిళా సంఘం కార్యదర్శి రేణుక మాట్లాడుతూ మణిపూర్‌లో కొంతకాలంగా మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి భాస్కర్, కెయుపిఎస్ నాగభూషణం, మహిళా సంఘం సహాయ కార్యదర్శి మల్లేశ్వరి, లక్ష్మీదేవి, అంజనమ్మ, కళావతి, నాగేశ్వరమ్మ, దేవి, సూర్యుడు, పుల్లయ్య పాల్గొన్నారు.

బిసి విద్యార్థి సంఘం నాయకుడిపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రఘు స్కూల్ కరస్పాండెంట్ రాఘవేంద్రను అసభ్య పదజాలంతో దూషించిన బిసి విద్యార్థి సంఘం నాయకుడు విష్ణువర్ధన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయివేటు పాఠశాలల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఇన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ ఇన్స్‌పెక్టర్ రెడ్డెప్పకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రయివేటు పాఠశాలల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, సిఆర్‌ఒ రవిచంద్రారెడ్డి, నగర గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, సభ్యులు మద్దయ్య, రామాంజనేయులు, విజయ్, రఫీ, జానకిరాములు, శ్రీవాత్సవ, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ మురళికి సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

ఆటో డ్రైవర్ మురళి ఆచారిని ఆదివారం తోటి ఆటో డ్రైవర్లు ఘనంగా సన్మానించారు. మురళి ఆచారి ఇటీవల ఇల్లు వదిలి వచ్చిన ఓ అమ్మాయి గుత్తి రైల్వే స్టేషన్ వద్ద సంచరిస్తుండగా గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ రామకష్ణారెడ్డి ఆ అమ్మాయిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఆటో డ్రైవర్ మురళి ఆచారి సమాజ సేవను గుర్తించిన ఎస్పీ శ్రీనివాసరావు శనివారం అభినందించడంతోపాటు రివార్డును అందజేశారు. విషయం తెలుసుకున్న ఆటో డ్రైవర్లు మురళి ఆచారిని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అనుబంధ సంస్థ ఆటో యూనియన్ అధ్యక్షుడు రామంజి ఉపాధ్యక్షుడు రజాక్ వలి, ప్రధాన కార్యదర్శి నజీర్, సంయుక్త కార్యదర్శి కె.సురేష్, ఆటో డ్రైవర్లు మొహమ్మద్, రఫీ, చెన్నకేశవ, రాజు, నాగేంద్ర, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ మురళి ఆచారిని సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఉరవకొండ : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కూడేరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎపి రైతుసంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ మాట్లాడుతూ రైతురుణాలను మాఫీ చేయాలని, తెలంగాణ తరహాలో రైతు, కౌలురైతులకు ప్రతి ఎకరాకు రూ.10వేలు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రమణ, నారాయణమ్మ, ప్రసాద్, వెంకటేష్, ఖాసీంపీరా, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సిపిఐ మండల నాయకులు సిపిఐ చింతా పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ తరహాలో రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని, పంటల బీమా అందించాలని నిర్వహించనున్న ధర్నాలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలకు మైక్ వితరణ

మైక్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి

నార్పల : మండల పరిధిలోని దుగుమర్రి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి విద్యార్థుల సౌకర్యార్థం ఒక స్పీకర్, హాట్ బాక్సులను ఆదివారం వితరణ చేశారు. ఈపాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసిన ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా బత్తలపల్లి మండలం దంపెట్ల గ్రామానికి బదిలీ అయ్యారు. దీంతో ప్రార్థన సమయంలో వినియోగించుకునేందుకు స్పీకరు, మధ్యాహ్న భోజనం వేడివేడిగా ఉంచేందుకు హాట్ బాక్స్‌లను అందజేశారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి : మండలంలోని రజాపురం గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విష్ణువర్ధన్(26) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కావేటి సముద్రం చెందిన విష్ణువర్ధన్, తాడిపత్రికి చెందిన మస్తాన్, వారి స్నేహితులు నాగార్జున, సుబ్రమణ్యంతో కలిసి రెండు ద్విచక్ర వాహనాల్లో కసాపురానికి దైవ దర్శనానికి వెళ్తుండగా రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వద్ద రోడ్డు డైవర్షన్ కోసం వేసిన మట్టి దిమ్మెను ఢీకొని విష్ణువర్ధన్, మస్తాన్ గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రులను అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ విష్ణువర్ధన్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని భట్టువానిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బ్రహ్మసముద్రం మండలం కోడిపల్లి గ్రామానికి చెందిన హరీష్ వ్యక్తిగత పనుల నిమిత్తం నూతిమడుగు వైపు వెళుతుండగా భట్టువానిపల్లి గ్రామ సమీపంలోని మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో హరీష్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారం అందించి కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

యాడికి : మండల పరిధిలోని భోగాలకట్ట గ్రామానికి చెందిన బోయ భాస్కర్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో ఇంట్లో మృతిచెందాడు. ఇంట్లో భోజనం చేస్తుండగా హఠాత్తుగా కుప్పకూలి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి చికిత్స చేసేలోపు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బి.సుధీంద్రనాథ్

సుధీంద్రనాథ్‌ను సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

గుత్తి : ఎపి బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన బి.సుధీంద్రనాథ్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం కర్నూలులోని దేవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ గౌర సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ హాజరై ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జ్వాలాపురం శ్రీకాంత్‌ను పలువురు సత్కరించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని పిఎం.చెర్లోపల్లిలో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు హాజరుకావాలని కోరారు.

కొలువుదీరిన పీర్లు

ఆత్మకూరు : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు పి.యాలేరు, తలుపురు గ్రామాల్లో శనివారం రాత్రి పీర్లను మెరిమిని చేసి చావిడిలలో కొలువుదీర్చారు. ఉత్సవాల్లో భాగంగా 24న స్వాములను వెండి ఆభరణాలతో అలంకరించనున్నట్లు ముల్లాసాబ్‌లు తెలిపారు. అలాగే 26న స్వామివారి చిన్న సరిగెత్తు, 27న విడిది, 28న పెద్ద సరిగెత్తు, 29న తెల్లవారుజామున గ్రామోత్సవం నిర్వహించి జల్దీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న చివరి దర్శనం ఉంటుందని వివరించారు.

ప్రార్థనలు అందుకుంటున్న కొలువుదీరిన పీర్లు

విఆర్ఎ మృతికి నివాళి

పెద్దపప్పూరు : చాగల్లు రెవెన్యూ గ్రామానికి గ్రామ రెవెన్యూ సహాయకుడి పని చేస్తున్న మద్దిలేటి మృతికి పలువురు నివాళులర్పించారు. అనారోగ్యం కారణంగా అనంతపురంలోని ఆసుపత్రిలో మద్దిలేటి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ లక్ష్మీకాంత్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందజేశారు.

పేద మహిళకు ఆర్థికసాయం

మహిళకు ఆర్థికసాయం అందజేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి పేద మహిళకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్‌తోపాటు రూ.10వేల ఆర్థికసాయాన్ని ఆదివారం బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు శ్రీహరి, సతీమణి లక్ష్మీ సహకారంతో ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. కుటుమిషన్ అందించడం ద్వారా మహిళకు ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కవిన్ ఆదిత్య, కిష్టప్ప, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

25న విద్యాసంస్థల బంద్

రాయదుర్గం : రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న రాయదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఎఐఎస్‌ఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు అంజి, కార్యదర్శి కోటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా నేటికీ నెరవేర్చలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల సాధనకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించనున్న నిరవధిక దీక్షను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ వేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే, ఏకలవ్య బాలికల, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా టీచింగ్, నాన్ టీచింగ్ పురుషుల ఉద్యోగులను తొలగించి మహిళా ఉద్యోగలను నియమించాలన్నారు. తరగతుల వారీగా అడ్మిషన్ల సంఖ్య పెంచాలని, 2023 విద్యా సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ అవకాశం కల్పించాలని, తాడిపత్రి, ముసుగులోడులో నూతనంగా నిర్మించిన గురుకుల పాఠశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే కొర్రపాడు, రొళ్ల పాఠశాలల్లో అదనపు తరగతి గదులు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న నిరవధిక దీక్షలో జిల్లావ్యాప్తంగా విద్యార్థి, కుల, ప్రజాసంఘాల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.